# ప్రజాశక్తి

సోమవారం 25 ఆగస్టు 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి





పాదయాత్రలో పాల్గొన్న ఎన్.రామారావు, రామస్వామి, మంత్రి రాజశేఖర్, పోరాట కమిటీ నేతలు

# ఉక్కులో ఇఒఐలు రద్దు చేయాలి

- నిర్వాసిత కాలనీల్లో బైకు ర్యాలీలు, పాదయాత్రలు
- 31న కూర్మన్నపాలెంలో సభను జయప్రదం చేయాలని పిలుపు


వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ 4లో..


## ఆయిల్ ఫామ్ విస్తరణపై దృష్టి

'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రహీం


▶ వార్త 2లో..




## ఘనంగా విసిసి మహాసభ


▶ వార్త 2లో..


# విశాఖలో ప్రకృతి వైద్య కళాశాల

- రాష్ట్రంలోనే మొదటిదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటన
- వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్** : ఆయుష్ వైద్య సేవలను మెరుగుపరచడం, ఆయుర్వేదం, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖవైపు దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో విశాఖలో తొలి నేచర్ క్యూర్ వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం ధ్రువీకరించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయని ఆయన వెల్లడించారు. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధమవుతున్నాయన్నారు. అలాగే విశాఖ నగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగశాల కూడా రాబోతుందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం 2016-17లో నేచర్ క్యూర్ ఆసుపత్రి (ప్రకృతి వైద్య కళాశాల), రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. అందులో భాగంగా విశాఖలో ఏర్పాటు అవుతున్న ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ.4.18 కోట్లు, నేచర్ క్యూర్ వైద్య కళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయన్నారు.



ప్రకృతి వైద్య కళాశాలకు కేటాయించనున్న భవనం

**ప్రవేశాలు ఇలా..**

మంత్రి తెలిపిన మిగతా 2లో..















## మొదటి పేజీ తరువాయి..

### విశాఖలో ప్రకృతి వైద్య కళాశాల

వివరాల ప్రకారం.. విశాఖలోని విమ్స్ ప్రాంగణంలో రూ.16.40 కోట్లతో తలపెట్టిన నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బిఎన్‌వైఎస్) కోర్సులో తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ కోర్సులో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపనుంది. ఆ కళాశాల పక్కనే రూ.14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరాయి. ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వీటి ఆధారంగా కేంద్రం అడ్మిషన్స్‌కు అనుమతి ఇవ్వనుంది. మరోవైపు సుమారు రూ.6 కోట్లతో ఆనందపురం మండలంలోని శొంఠ్యాంలో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీల భవన నిర్మాణాలు పూర్తికావొచ్చాయి. సుమారు రూ.5 కోట్లతో పరికరాలు, యంత్రాలు కొనుగోలు చేయనున్నారు.

### దేవాదాయ భూములు అన్యాక్రాంతం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్రంలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న దేవాదాయ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని, రక్షించాలని అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వారసత్వ సంపదను కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దేవాలయ భూముల కాజేత కొనసాగుతోందన్నారు.

### అందుబాటులోకి టయోటా అర్బన్ అప్‌గ్రేడ్ వెర్షన్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దాని ప్రసిద్ధ కాంపాక్ట్ ఎస్‌యువి అర్బన్ క్రూయిజర్ టైజర్‌కు రెండు ముఖ్యమైన అప్‌గ్రేడ్‌లను ప్రకటించిందని ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి వరీందర్ వాధ్వా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని వేరియంట్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను ప్రామాణికంగా జోడించిందన్నారు. సంస్థ ఎల్లప్పుడూ తన కస్టమర్ల పట్ల అత్యధిక విలువ ఉంచి, సాధ్యమైనంత ఉత్తమమైన కార్లను అందించడంపై దృష్టి సారిస్తుందని చెప్పారు. కొత్త ఆకర్షణీయమైన లుక్ బ్లూయిష్ బ్లాక్‌ను పరిచయం చేస్తోందన్నారు.

### నేడు జోన్ 3లో తాగునీటికి అంతరాయం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** జివిఎంసి జోన్3లో టిఎస్ఆర్ నుంచి హై లెవెల్ రిజర్వాయర్‌కు వచ్చే ప్రధాన పంపింగ్ మెయిన్‌లైన్ తాగునీటి సరఫరా చేయు 450 ఎంఎం డిఐ సిఐ పైప్‌లైను మరమ్మతులకు గురైనందున వెంటనే మరమ్మతులు చేపట్టారని కావున 25వ తేదీ సోమవారం జోన్ 3 వార్డ్ నం 20 ఈస్ట్ పాయింట్ కాలనీ, పెదవాల్తేర్ వార్డ్ నంబర్ 21 తమిళ్‌వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లివీధి, ఎయూ అవుట్‌గేట్‌డౌన్, ఓల్డ్ సిబిఐ డౌన్, మైత్రీనగర్, వినయగార అపార్ట్‌మెంట్స్, స్విమ్మింగ్‌పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్ రోడ్ సబ్‌మెరైన్, ఒషన్ వ్యూ లేఅవుట్, చినవాల్తేర్ వార్డ్ నంబర్ 22, బాలాజీ నగర్, టైమ్స్‌ఆఫ్‌ఇండియా, సిద్ధార్థనగర్ వార్డ్ నంబర్ 24, ఓల్డ్ రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం పరిసరాలు, వార్డ్ నం 27 అశోక్‌నగర్, రామటాకీస్‌రోడ్, శ్రీనగర్, బుద్దిడిపార్క్ రోడ్, రెడ్డి హాస్పిటల్ రోడ్, శ్రీనగర్ సాయిబాబా దేవాలయంరోడ్, ద్వారకానగర్ రోడ్ నంబర్ 1 నుండి 6 లైన్ వరకు, అమర్ నగర్ చర్చి రోడ్, సి.బి.యం. కాంపౌండ్, రామటాకీస్ లేడీస్ బుకింగ్ రోడ్, జోన్ - 4 వార్డ్ నం. 28 ఫాకర్స్ లే అవుట్, కైలాసమెట్ట, రామ్‌నగర్ మొదలైన ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం కలుగుతుందన్నారు. ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తారని పై తెలిపిన ప్రాంతాల ప్రజలు జివిఎంసికి సహకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ కోరారు.

### స్టేడియమా ? గొడౌనా ?

**ప్రజాశక్తి -ఎంవిపికాలనీ :** ఇంటర్నేషనల్ యోగాడేను పురస్కరించుకొని తెప్పించిన యోగా మ్యాట్‌లు ఎయు ఇండోర్ స్టేడియంలో నేటికీ మూలుగుతున్నాయి. దాదాపు ఐదు లారీల సరుకు ఇక్కడే ఉంది. ఇండోర్‌గేమ్స్ నిర్వహించే స్టేడియాన్ని గోడౌన్ కింద వాడటం దుర్మార్గమని, తాము క్రీడలకు దూరమవుతున్నామని పలువురు ఎయు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విసి, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని మిగిలి ఉన్న మ్యాట్‌లను ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేసి ఇండోర్‌స్టేడియాన్ని ఖాళీ చేయించాలని కోరుతున్నారు.



స్టేడియం గదిలో ఉన్న యోగా మ్యాట్‌లు

### రక్తదానం గొప్పసేవ

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** ప్రస్తుత సమాజంలో రక్త దానానికి మించిన సమాజసేవ మరొకటి లేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మదర్‌థెరీసా జయంతి సందర్భంగా నగరంలోని 19వ వార్డు పెదజాలారి పేటలో ప్రముఖ సంఘసేవకులు ఒలిశెట్టి గురునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ మహా రక్తదాన శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ శాంతిదూత మదర్‌థెరీసా జయంతి సందర్భంగా ఇటువంటి సామాజికసేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం నిర్వహించిన ఒలిశెట్టి గురునాథ్‌ను ఆయన అభినందించారు. పలువురు యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తం దానం చేశారు. ఒలిశెట్టి సత్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి త్రీటౌన్ సిఐ పైడయ్య హాజరయ్యారు.

# ఆయిల్ ఫామ్ విస్తరణపై దృష్టి

#### 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రహీం

**ప్రజాశక్తి - అనకాపల్లి :** రానురానూ నూనె గింజల ఉత్పత్తి తగ్గడం, తక్కువ దిగుబడులు రావడంతో ప్రజలకు సరిపడినంత నూనె లభించడం లేదని, ఈ క్రమంలో ఆయిల్ ఫామ్ విస్తరణపై దృష్టి సారించామని అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రహీం తెలిపారు. ఆయిల్ ఫామ్ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వివిధ రాయితీలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.

**ఆయిల్ పామ్ విస్తరణ పథకం ముఖ్య ఉద్దేశ్యమేంటి ?**

రాష్ట్రంలో నూనె ఉత్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో మంచినీటి బోరు ఉన్న రైతులకు వివిధ రాయితీలు అందించి ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆయిల్ ఫామ్ రైతులకు ఎకరాకు 57, అలాగే హెక్టారుకు 143 ఆయిల్ ఫామ్ మొక్కలను అందిస్తున్నాం.

**ఎటువంటి ఆర్థిక సాయం అందిస్తున్నారు ?**

బోరు ఉన్న రైతులకు మొక్కలతో పాటు మొక్కలు పెరిగే వరకు నాలుగు సంవత్సరాలపాటు ధన రూపేణా రూ.21 వేల సాయం అందిస్తున్నాం. నాలుగు విడతలుగా రూ.5250 చొప్పున ఇస్తున్నాం.

**ఈ నాలుగేళ్లలో అంతర్ పంటలు వేసుకోవొచ్చా ?**







అంతర్ పంటలు వేసుకోవచ్చు. వీటికి కూడా ప్రభుత్వం సాయం అందిస్తుంది. మినుములు, పెసలు, అరటి, కూరగాయలు, నువ్వులు, వేరుశనగ వగైరాలను అంతర పంటలుగా వేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన, అర్హులైన రైతులను గుర్తించి ఈ పథకం అమలు చేస్తున్నాం.

# ఘనంగా విసిసి మహాసభ

#### పెద్ద సంఖ్యలో హాజరైన చిన్నారులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ నాలుగో జిల్లా మహాసభ ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ప్రారంభ సభలో కన్సర్న్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ ప్రెసిడెంట్ పిల్లలమర్రి రఘు, రోటరీ క్లబ్ డైమండ్స్ ప్రెసిడెంట్ కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ నీరజ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధి దీపా, సునీత, ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రతినిధి సంజయ్, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు పిల్లలకు సందేశాలిచ్చారు. అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ నుంచి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. మహాసభలో విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ బాలలలో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించే లక్ష్యంతో గడచిన 15 సంవత్సరములుగా విశాఖ జిల్లాలో విసిసి పని చేస్తోందన్నారు. పిల్లలు ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలన్నారు. విసిసి జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని, అందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. విసిసి జిల్లా అధ్యక్షురాలు ఎస్.హరిత మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలోని ప్రగతి, ప్రణాళికను వివరించారు. అనంతరం జోన్ల వారీగా చర్చలు జరిగాయి. బాలలలో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను పెంచడం, సంస్కృతి, కళలు నేర్పించడం, క్రీడలను ప్రోత్సహించడం, ప్రకృతి పట్ల ఆసక్తి, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం, శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దేశభక్తి పెంపొందించి సమాజంలో వారి పాత్రను తెలియజేయడంపై ప్రణాళికలు రూపొందించారు. శ్రమ పట్ల గౌరవం, సమిష్టితత్వాన్ని పెంపొందించడం, సైన్సు పట్ల అవగాహన కల్పించడం, ఇతరులకు సహాయపడడం, పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంచడం వంటి అంశాలపై కర్తవ్యాలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 400 మంది పాల్గొన్నారు. శైలజ, అలేఖ్య, నిఖిల్ అధ్యక్షత వహించారు. శశి బృందం వాలంటీర్లుగా వ్యవహరించారు. జోన్ కన్వీనర్లు అప్పారావు, లీలావతి, సంధ్య, సరోజిని, అరుణ, శ్రావణి, భవాని, పుష్ప పాల్గొన్నారు.





మాట్లాడుతున్న డాక్టర్ కె.రమాప్రభ, వేదికపై పలువురు ప్రముఖులు

### మెడికవర్‌లో ఎండోస్కోపిక్ వర్క్‌షాప్

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** మెడికవర్ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం, విశాఖపట్నం ఘూట్‌క్లబ్, ఐఎంఎ విశాఖపట్నం బ్రాంచి సంయుక్తంగా ఆదివారం డాక్టర్ నిష్ఠల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన ఎండోస్కోపిక్ వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ థెరప్యూటిక్ విధానాలను ప్రదర్శించారు. పూణే, విశాఖపట్నం ప్రాంతాల నుంచి 50 మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



# సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యాన ప్రాపర్టీ ఎక్స్‌పో

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి రికవరీ విభాగం చీఫ్ మేనేజర్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని స్థానిక బ్రాంచ్ మేనేజర్లు ద్వారకానగర్ ఎల్‌ఐసి భవనంలో ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారం నిర్వహించారు. ఈ ప్రాపర్టీ ఎక్స్ పోలో సర్ఫేసి చట్టం కింద అమ్మకానికి ఉన్న ఆస్తులు ఈ వేలం కోసం ఉంచాలని ప్రతిపాదించిన ప్రతిపాదిత ప్రాపర్టీలను కొనుగోలుదారులకు చూపించారు. కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 30 మంది పలు ప్రాపర్టీస్‌పై ఆసక్తి కనబరిచారు.

### ముగిసిన స్పెషల్ ఒలింపిక్స్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జెసిఐ వైజాగ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ క్రీడలు అట్టహాసంగా ముగిసాయి. శనివారం రాత్రి పోలీస్ బ్యారెక్స్‌గ్రౌండ్లో జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు ట్రోఫీలు బహుకరించారు. సుమారు 900 మంది విభిన్న ప్రతిభావంతులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. బహుమతి ప్రధాన కార్యక్రమంలో జెసిఐ వైజాగ్ అధ్యక్షుడు డాక్టర్ నడిపిల్లి చరిష్మా, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్, జోన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య వసంతవాడ, ప్రాజెక్ట్ చైర్మన్ ప్రభాకర్ బొట్టా, రవికాంత్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి అప్పలరాజు, విసిపిటిఎల్. ప్రతినిధి జిథా, లీ ఫార్మా ప్రతినిధి లీలారాణి, వెల్నెస్ బ్రాండిక్స్ ప్రతినిధి వసుధ, డిజెటి. హైకా ఎం.డి.సంజయ్, సిఇఒ జోపికా తదితరులు విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సాహించారు. **విజేతలు:** ఆల్ రౌండ్ ఛాంపియన్స్: లేబెన్స్‌హిల్ఫే స్కూల్ విద్యార్థులు, హియరింగ్ ఇంపెయిర్డ్ ఛాంపియన్స్: ప్రియదర్శిని సర్వీస్ ఆర్గనైజేషన్ స్కూల్ విద్యార్థులు, విజువల్లి ఇంపెయిర్డ్ ఛాంపియన్స్ : నేత్ర విద్యాలయ విద్యార్థులు, ఫిజికల్ చాలెంజ్డ్ ఛాంపియన్స్: అసోసియేషన్ సాయి కొరియన్ స్కూల్ విద్యార్థులు, ఇంటెలెక్చువల్లి ఇంపెయిర్డ్ ఛాంపియన్స్: హిడెన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ విద్యార్థులు

# ప్రమాదాలకు నిలయంగా ఆనందపురం కూడలి


రద్దీగా ఉన్న ఆనందపురం కూడలి

**ప్రజాశక్తి- ఆనందపురం :** విశాఖపట్నం ప్రధాన ద్వారంగా మారిన ఆనందపురం కూడలి ప్రస్తుతం ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. కూడలిలో బ్రిడ్జి నిర్మాణం తరువాత, విశాఖపట్నం నుండి వచ్చే వాహనాలు ప్రస్తుతం కూడలి నుంచి సర్వీస్ రోడ్డు ద్వారా శ్రీకాకుళం వైపు వెళ్లాల్సి వస్తోంది. ఇదే సమయంలో పెందుర్తి, బంటుపల్లి, పూల మార్కెట్ నుండి వచ్చే వాహనాలు కూడా అదే దారిలో కలవడం వల్ల ట్రాఫిక్ తీవ్రమవుతోంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**హైవేపైనే వ్యాపారంలో ప్రమాదాలు**

ఆనందపురం జంక్షన్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ పూల మార్కెట్ ఉండటంతో మహిళలు, వ్యాపారులు రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నారు. వాహనాలు ఆపి కొనుగోళ్లు జరుపుతున్న సమయంలో ఇతర వాహనాలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, స్థితిగతులు మారడం లేదు. సర్వీస్ రోడ్డు పక్కన ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**బస్ షెల్టర్ లేక అసౌకర్యాలు**

ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు ఆనందపురం కూడలి నుంచి ప్రయాణిస్తున్నా బస్సు షెల్టర్ లేకపోవడం విశేషం. బస్సు ఎక్కడ ఆగుతుందనే స్పష్టత లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం ఆర్‌టిసి డిపో మేనేజర్ ఈ సమస్యను పరిశీలించినప్పటికీ ఇప్పటి వరకు షెల్టర్ నిర్మాణం చేపట్టకపోవడం నిరాశ కలిగిస్తోంది. లొడగలవానిపాలెం వద్ద ఉన్న వినియోగంలో లేని మార్కెట్‌ను కూరగాయల మార్కెట్‌గా అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు. పాత బస్టాండ్‌ను తిరిగి వినియోగంలోకి తేవాలని, హైవే పక్కనున్న పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు వినోద ప్రదేశంగా తీర్చిదిద్దాలని స్థానికులు సూచిస్తున్నారు.


మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్ర

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

**ప్రజాశక్తి- ఆనందపురం:** ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్ర ప్రసంగించారు. విద్యార్థులు చదువులో, ప్రవర్తనలో ఉన్న భయాలను అధిగమించి వ్యక్తిత్వ వికాసం సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో సృజనాత్మకతను వెలికితీయగలిగితే అద్భుతాలు సాధ్యమవుతాయని చెప్పారు. నేటి విద్యార్థులు రేపటి భారతదేశానికి దిశానిర్దేశం చేసే వారని గుర్తుచేస్తూ, తప్పటడుగులు వేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మహేశ్వరరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గణితంలో మెళకువలు

**ప్రజాశక్తి -తగరపువలస :** చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహించారు. గణితంలో మెళకువలను గణిత ఉపాధ్యాయులు సిహెచ్.దయాసాగర్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమ లో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు ఎల్ఎ.శ్రీనివాస్, వంగపండు దుష్యంత్, వైవి.రమణ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## హోమియో మందుల పంపిణీ

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామ చంద్రమూర్తి ప్రారంభించారు. హోమియో వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 88 మందిని పరీక్షించి హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి విరాళం

**ప్రజాశక్తి- వేపగుంట :** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి నిత్యాన్నప్రసాదానికి గాజువాక, ఆటోనగర్‌కు చెందిన గణేష్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత జి.వెంకటనాయుడు దంపతులు రూ.2,08,000 విరాళం చెక్కును దేవస్థానం పిఆర్ఒ కార్యాలయంలో అందించారు. విరాళం దాతలైన వెంకటనాయుడు దంపతులకు స్వామి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి శేష వస్త్రంతో సత్కరించి, వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు.

## ప్రజాసేవే లక్ష్యం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** దేశ క్షేమం కోసం 5వేల మందితో సంఘమిత్ర సేవా సైన్యం తయారుచేసి ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సంఘమిత్ర సూరిబాబు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణ, సాధించిన విజయాలు, భవిష్యత్తు కార్యాచరణపై పౌరగ్రంథాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ, 22 ఏళ్లుగా 18 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజలకు తన వంతు మంచిచేయాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రూపాయికే విద్య, ఖైదీలకు వృత్తి విద్యలో శిక్షణ, ప్రజా చైతన్యరథాలు, సేవ చేస్తున్న వారిని సత్కరించడం, పేదలకు మజ్జిగ, టీ పంపిణీ, పేదలకు వస్త్రాల పంపిణీ, ట్రాఫిక్‌పై అవగాహన, నిస్సహాయలకు వైద్యసహాయంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో ఇంకుడు గుంతలు, జీవనదుల అనుసంధానం తదితర 11 సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ఉద్యమాలే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రచారం, హంగులు, ఆర్భాటం కోసం తాను ఈ సేవా కార్యక్రమాలు చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి బి.కె.రామేశ్వరి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, యువసేవ ఫౌండేషన్ అధ్యక్షులు హరి, మజ్జి దేవిశ్రీ తదితరులంతా సంఘమిత్ర సూరిబాబు సేవలను కొనియాడారు. తొలుత ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ ఆలపించిన పలు గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## అలరించిన నృత్య ప్రదర్శన

**ప్రజాశక్తి-మధురవాడ :** శిల్పారామం జాతరలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా కళారాధనా మ్యూజిక్ అండ్ అకాడమీ చిన్నారులచే ఆదివారం నిర్వహించిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముందుగా మూషికవాహన, కాలింగినర్ధన, నాగస్తుతి, నారసింహ కౌతం, భారతవేదమున, మహాగణపతిం, ఐగిరినందిని, నారాయణాతే నమోనమో, రాజాం కొండా, కస్తూరి తిలకం వంటి గేయాలకు షణ్ముఖ ప్రియ, నక్షత్ర, రోషిత, జ్యోతికశ్రీ, వేదశ్రీ, సంహిత, సాయి ప్రణవి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని శిల్పరామం అధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.


అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో...

# ఇక్కడ స్మార్ట్.. అక్కడ గుంతలు...

**ప్రజాశక్తి-పెందుర్తి :** జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌కు అద్దంలో మెరిసిన విధంగా తారు రోడ్డును వేశారు. సుజాతనగర్ నుండి సప్తగిరి, అస్మినగర్‌లో వందలాది కుటుంబాలు రాకపోకలు సాగించే రోడ్లు మాత్రం యుసిడి పనుల నిమిత్తం తవ్వి వదిలేయడంతో గుంతల మయంగా మారాయి. రాత్రిపూట ప్రయాణం చేసినప్పుడు పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని వాహనదారులు చెబుతున్నారు. పన్నులు వసూలు చేస్తున్నా సరే ఇటు అధికారులు కానీ అటు ప్రజాప్రతినిధులు కానీ ఈ కాలనీల వైపు చూడటం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు వెయ్యాలని కోరుతున్నారు.


పేదలు నివసించే ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి

# మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**మట్టి వినాయక విగ్రహాలను ఆదివారం పలుచోట్ల పంపిణీచేశారు.**

**ములగాడ :** ప్రతిభ హైస్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ తోణంగి వెంకటరమణి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీచేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని వెంకటరమణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు


'ప్రతిభ'లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణి

**పెందుర్తి :** మాజీ పెందుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వేగి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మట్టి గణపతి విగ్రహాలతో పాటు గొడుగు, పుస్తకాలను పెందుర్తి జంక్షన్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శరగడం అప్పారావు, ఆళ్ల నాగరాజు, కాండ్రేగుల వెంకట్రావు, పెంటకోట నాయుడు, మల్ల రవి, విశ్వేశ్వరరావు, తులసిరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు

**వేపగుంట:** జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లో సోమవారం ఉదయం ఐక్యత సేవా సంఘం కార్యాలయం వద్ద 500 మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఐక్యత సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఎర్ర నాగరాజు తెలిపారు.

**పాయకరావుపేట :** : పట్టణంలోని హైమ నేత్రాలయం హాస్పిటల్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఆదివారం మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ చేశారు. టిడిపి పాయకరావుపేట మాజీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా హైమ నేత్రాలయం వ్యవస్థాపకులు డాక్టర్ పిఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ, వినాయక చవితికి అందరూ మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి, కాలుష్యనివారణ, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియం కేరి, బొంది కాశీ విశ్వనాథ్, మల్లపురెడ్డి రమాకుమారి, వేములపూడి అప్పారావు, దువ్వ శ్రీనివాస్ యాదవ్, కట్టా శ్రీను పాల్గొన్నారు.

**అనకాపల్లి :** స్థానిక రాజా థియేటర్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 3,500 వినాయకుని మట్టి ప్రతిమలను భక్తులకు పంపిణి చేసారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ పాల్గొని,. భక్తులకు గణపతి ప్రతిమలతోపాటు వ్రత కథ పుస్తకం, పసుపు, కుంకుమ అందజేశారు ఏటా మట్టి గణపతులను ఉచితంగా అందిస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులకు అభినందిం చారు. శిల్పిని, గ్రీన్ క్లబ్ సభ్యులను సత్కరించారు.



హైమా నేత్రాలయం వద్ద మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ



విన్నకోట రామును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి

**ప్రజాశక్తి-పెందుర్తి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని పెందుర్తి అసెంబ్లీ పార్టీ కో-ఆర్డినేటర్ విన్నకోట రాము అన్నారు. కో-ఆర్డినేటర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు 97వ వార్డు పరిధి ఉడా కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.షర్మిలారెడ్డి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న, ఇతర నాయకులందరూ తాను కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులందరినీ కలుపుకొని నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బొంతు రమణ, కాళ్ల సత్యనారాయణ, బుద్ధ మహేష్, ఆదిమూర్తి, శానాపతి రాజు, ఆర్ఆర్.నాయుడు, గోవిందరావు, వరప్రసాద్, ఎమ్‌విఆర్.పాత్రుడు, మల్లేశ్వరరావు, ఆరిపాక సత్యనారాయణ, ముక్క రామనాయుడు, పిడిది ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

## కూటమి పథకాలు మోసపూరితం

**ప్రజాశక్తి -ములగాడ :** కూటమి ప్రభుత్వానికి మోసపూరిత పథకాలని వైసిపి పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి మళ్ల విజయప్రసాద్ ఆరోపించారు. జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం రెడ్డివీధిలో వార్డు వైసిపి అధ్యక్షుడు పిలక రాము ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి నేతలు అమలుకాని హామీలిచ్చి ప్రజలను మోసగించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అనంతకుమార్, కొలీ నూకరెడ్డి, ఎన్‌వి.రమణ, భోగవిల్లి నాగభూషణం, నూనెల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక పందిళ్లలో భద్రత ముఖ్యం

**ప్రజాశక్తి -గాజువాక :** వినాయక చవితి పందిళ్లలో భద్రతా చర్యలు చేపట్టాలని సౌత్ ఎసిపి వై.శ్రీనివాసరావు చెప్పారు. గాజువాక, స్టీల్‌ప్లాంట్, దువ్వాడ స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తున్న వినాయక చవితి నిర్వాహకులతో ఆదివారం గాజువాకలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా జివిఎంసి అనుమతి తీసుకోవాలని చెప్పారు. పూజ కోసం ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని, ప్రజలు నడిచే మార్గంలో పందిరిలు ఏర్పాటుచేయరాదని, 11 రోజులుకు మించి అనుమతి లేదని, డిజెలు ఏర్పాటు చేయరాదని, బాణాసంచా పేల్చరాదని తెలిపారు. ఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో గాజువాక, దువ్వాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పార్థసారథి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## సామాజిక భవనం ప్రారంభం

**ప్రజాశక్తి -గాజువాక :** జివిఎంసి 76వ వార్డు పరిధి భరత్‌నగర్‌లో రూ.15లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులో ఉన్న గ్రామాలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పనకు కృషిచేశామని తెలిపారు. కార్యక్రమంలో కూన వెంకట్రావు, రెడ్డి, జీలకర్ర రమణ, రమణ, సురేష్, పీత నాగరాజు, శంకర్, బొడ్డు సత్యారావు, లక్ష్మి, సతీష్, రాజా, నాగు, సోములు, మూర్తి, రాము నాయుడు, తిరుపతిరావు, పాల్గొన్నారు.

# ఉక్కులో ఇఒఐలు రద్దు చేయాలి

- నిర్వాసిత కాలనీల్లో బైకు ర్యాలీలు, పాదయాత్రలు
- 31న కూర్మన్నపాలెంలో సభను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-యంత్రాంగం

**ఇఒఐ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వాసిత కాలనీల్లో ఆదివారం బైక్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించారు.**

**ఉక్కునగరం :** అగనంపూడి కాలనీ, కొండయ్యవలస కో-ఆపరేటివ్ స్టోర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. వడ్లపూడి, కూర్మన్నపాలెం ముస్తాఫా జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉక్కునగరంలో రైతు బజార్ వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సెక్టార్-3 వరకు బైక్ ర్యాలీ చేశారు. కూర్మన్నపాలెం వడ్లపూడి తదితర ప్రాంతాలలో ర్యాలీలు అనంతరం సమావేశం నిర్వహించారు. కూర్మన్నపాలెంలో జరిగిన సమావేశంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, 44 విభాగాలను ప్రైవేటు వారికి అప్పగించేందుకు ఇఒఐలను విడుదల చేశారని తెలిపారు. ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తూ ఉన్నతంగా నడపడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కూటమి నాయకులు మాయమాటలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి సహకరిస్తుందన్నారు. కార్మికుల ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరాజు, కన్నంరెడ్డి జగ్గారావు, వీరాస్వామి, భాస్కరరావు, సన్యాసిరావు, వేణుబాబు, విశ్వనాథం, దత్తాత్రేయరాజు తదితరులు పాల్గొన్నారు.




కూర్మన్నపాలెంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

### పెదగంట్యాడలో పాదయాత్ర

**గాజువాక :** అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన పెదగంట్యాడ జంక్షన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర పెదగంట్యాడ నిర్వాసితులు కాలనీ నుంచి నెల్లిముక్కు, సిద్దేశ్వరం, సీతానగరం, చినకోరాడ, దుర్గవానిపాలెం మీదుగా నడుపూరు గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, పిట్టా రెడ్డి, గుజ్జి గణపతి మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని, 44 విభాగాలకు సంబందించిన ఇఒఐ టెండర్లు రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయల్‌లో విలీనం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ఉద్యోగాలు కల్పించాలని, హెచ్‌ఆర్‌ఎతో కూడుకున్న పెండింగ్ పూర్తి జీతాలు ఇవ్వాలని, టౌన్ షిప్‌లో కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని ప్రైవేటీకరణ చెయ్యకుండా ఆపాలని, రాష్ట్రంలో అన్ని పార్టీలను కలుపుకొని ప్రధాన మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పాదయాత్రలో పి.వి.రమణమూర్తి, మసేన్‌రావు, నందికి తాతారావు, ముసిరి శ్రీనివాసరావు, నమ్మి రమణ, తిప్పల గురునాథ్‌రెడ్డి, కొవిరి అవతారం, కొండా శ్రీనివాస్ రెడ్డి, గేదల మధుసూదన్‌రెడ్డి, పూతి పోతయ్యరెడ్డి, వంశీ, నాగిరెడ్డి, ఊరుకుటి అప్పారావు, గొందేశీ రాము, నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

### గంగవరంలో...

అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన గంగవరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గంగవరంలో ప్రారంభమైన ర్యాలీ జాలారిపల్లిపాలెం, పల్లిపాలెం, చిన్న పల్లిపాలెం మీదుగా కొనసాగింది. పెద్ద ఎత్తున నిర్వాసితులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కారి నూకరాజు, వై.సోమేశ్వరరావు, పైడిరాజు, డివి.రెడ్డి, పేర్ల నూకరాజు, పేర్ల మస్తాన్ పాల్గొన్నారు.




ఉక్కునగరంలో...



గంగవరంలో బైక్ ర్యాలీ చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

## పుష్పాంజలి సాహూకు ఘన నివాళి

**ప్రజాశక్తి-మాధవధార :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన మహిళా ఉద్యమ నాయకులు ఎ.పుష్పాంజలి సాహూ ప్రథమ వర్ధంతి సభను సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కె.అనురాధ అధ్యక్షతన పుష్పాంజలి సాహూ చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎం.సుజాత, ఎం.జయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. సభకు ముఖ్య వక్తగా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ హాజరై మాట్లాడుతూ, దోపిడీలేని సమ సమాజం లక్ష్యం కోసం పుష్పాంజలి సాహూ చివరి వరకు పనిచేశారని కొనియాడారు. 2006 సంవత్సరం ఐద్వాలో చేరి మహిళా సమస్యలపై చురుకుగా పనిచేశారని తెలిపారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారని పేర్కొన్నారు. భర్త, పిల్లలు, కోడలిని పార్టీ విభాగాల్లో పనిచేసేలా కృషి చేశారని తెలిపారు. క్రమశిక్షణ నిబద్ధతగల కార్యకర్త పుష్పాంజలి సాహూ డ్వాక్రా గ్రూపులతో సన్నిహిత సంబంధం కలిగి బాలల సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. లీగల్ సెల్ కౌన్సెలింగ్ ద్వారా ఎన్నో కుటుంబాలను నిలబెట్టారన్నారు. జోన్ కార్యదర్శి సిహెచ్.సుమిత్ర మాట్లాడుతూ, ఆమెను కేన్సర్ మహమ్మారి ఆకస్మిక మరణానికి గురి చేసిందన్నారు. కేన్సర్‌కు కారణమైన కాలుష్యంపై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె లేని లోటు కుటుంబ సభ్యులకే కాక మహిళా సంఘానికి, పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు నాయకులు ఎస్.సోమేశ్వరరావు, పి.రామారావు, ప్రకాశరావు, ఎస్.శ్రావణ్, ఒ.అప్పారావు, ఐద్వా నాయకులు ఒ. విజయ, పార్వతి, ఎస్.ఆదిలక్ష్మి బిఎన్‌ఆర్ ఫౌండేషన్ నాయకులు అప్పలరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పుష్పాంజలి సాహూ వర్ధంతి సభలో మాట్లాడుతున్న పద్మ

## రైల్వే జోన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి- మాధవధార :** సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామమోహన్ రావు, జోనల్ ప్రెసిడెంట్ ఆర్‌విఎస్‌ఎస్.రావు నేతృత్వంలో శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రామిక్ యూనియన్ నాయకులు సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటు ప్రక్రియ, జనరల్ మేనేజర్, ఉన్నతాధికారుల నియామకం, జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మాణం, తాత్కాలికంగా జిఎం కార్యాలయం ఏర్పాటు, జోన్ కార్యకలాపాలను ప్రారంభించడానికి అత్యంత ఆవశ్యకమైన గెజిట్ నోటిఫికేషన్ విడుదల గురించి మాధవ్‌తో చర్చించారు. ప్రతిపాదిత సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో విశాఖపట్నం డివిజన్ ఉండాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పికె.పట్‌సహాని నాయకత్వంలో చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు పి.ఆదినారాయణ, ఎం.రాజేష్, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న రౌతు శ్రీనివాస్

**ప్రజాశక్తి - పరవాడ:** మండలంలోని లంకెలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం అనకాపల్లి జిల్లా టెన్నికాయిట్ జట్టు ఎంపికలను జాతీయ స్థాయి టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు రౌతు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువ ఆటగాళ్లలో ప్రతిభ ఉన్న వారిని ఎంపిక చేసి, జిల్లా టెన్నికాయిట్ టీంలో చేరేందుకు అవకాశం ఇవ్వడం ఆనందదాయకమన్నారు యువతలో క్రీడాభిరుచి పెంపొందించి, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి గంజి కనకారావు, మాస్టారు సత్యనారాయణ, మోటూరి నాగేశ్వరరావు, రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - పరవాడ** : జివిఎంసి 79వ వార్డు అగనంపూడి గల్లవానిపాలెం మామ్స్ హాస్పిటల్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నటు స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ భరోసానిచ్చారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలు, వీధి లైట్లు, తాగునీరు వంటి పలు సమస్యలపై స్థానికులు వినతిపత్రం అందించగా, ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కరణం జగదీష్, గల్లా రుద్రకుమార్, మాడిసె వెంకటరావు, సింగిడి సింహాచలం పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేశ్, భగత్ పాల్గొన్నారు.

## నేడు సాయినాథ్ ఆలయ వార్షికోత్సవం

**ప్రజాశక్తి- కశింకోట :** మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలోని సాయినాథ్ ఆలయ12 వార్షికోత్సవాన్ని ఈనెల25న సోమవారం నిర్వహించనున్నట్లు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆలయ కమిటీ చైర్మన్ గొంతిని శ్రీనివాసరావు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన ఉందన్నారు. వేడుకలో భీమిలి, అనకాపల్లి ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పీలా గోవింద భీమరశెట్టి రాంకీ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## ఛిద్రమైన కల్వర్టుతో చిక్కులు

### రాకపోకలకు వాహనదారులు, ప్రజల ఇక్కట్లు



కల్వర్టు పాడవ్వడంతో రోడ్డు మధ్య గుంతలో నిలిచిన నీరు

**ప్రజాశక్తి -కోటవురట్ల :** మాకవరపాలెం మండలం నుంచి కోటవురట్ల వచ్చే ప్రధాన రహదారి బిఎస్ పేట సమీపంలో రహదారి వద్ద చెరువు నుంచి వచ్చే మిగులు నీరు పోయేందుకు గతంలో ఏర్పాటు చేసిన ర్యాంపు కల్వర్టు పూర్తిగా ఛిద్రమైపోయింది, అయితే చిత్రమైపోయిన కల్వర్టు ప్రాంతం కోటవురట్ల రెవిన్యూ పరిధిలో రాజుపేట గ్రామ సరిహద్దులో ఉండడంతో ఆ కల్వర్టును ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు వాహనదారులు చర్చించుకుంటున్నారు, దాదాపు దశాబ్దంన్నర కాలంగా ఈ సమస్య ఉంది. ఎపుడూ గోతుల నిండా నీటితో వాహనదారులు పాదచారులు అవస్థలు పడుతున్నా ఉన్న ఎవరు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాత్రి సమయంలో వాహనాలు కూడా అదుపు తప్పుతున్నాయి, అధికారులు నాయకులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు సహా వాహనదారులు కోరుకుంటున్నారు.

### విఎఎల సమస్యల పరిష్కారానికి

# మరో పోరాటానికి సిద్ధంకండి!

- జిల్లా మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

**ప్రజాశక్తి -.అనకాపల్లి** : విఒఎల సమస్యల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్ల) ఉద్యోగుల సంఘం (సిఐటియు)జిల్లా 4వ మహాసభ జరిగింది. మహాసభకు ముందు విఒఎ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు పతాకావిష్కరణ చేయగా, సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు మహాసభ ప్రారంభించారు.

అనంతరం మహాసభలో విఒఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపులను సంఘటితం చేసి, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న విఒఎలను ప్రభుత్వం గుర్తించలేదని, సుదీర్ఘకాలంగా మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దుకు చేస్తున్న పోరాటంపై స్పందించడం లేదన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గత ఆందోళన నేపథ్యంలో ఇచ్చిన హామీ ప్రకారంగా మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ వెంటనే రద్దు చేసి, విఒఎలకు కనీస వేతనాలు పెంచి, గ్రూప్ ఇన్సూరెన్స్, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు .మహాసభలో కార్యదర్శి నివేదికను జిల్లా కార్యదర్శి సిహెచ్ రూపాదేవి ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సంఘం జిల్లా నాయకులు సిహెచ్‌ఎల్‌ఎన్ రాజేష్, రాజ్యలక్ష్మి, ఉష, వెంకటలక్ష్మి, గుణ, భవాని, సత్యవతి, సత్యం, అప్పలనాయుడు తదితరులు మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది.

## విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



సాయివిద్యానికేతన్‌లో విద్యార్థులతో డాక్టర్ విజయ

**ప్రజాశక్తి - పరవాడ :** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు మండలంలోని చింతల గొర్లివానిపాలెం గ్రామంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రంగారావు అన్నారు. ఆదివారం పాఠశాలలో ప్రత్యేక వైద్యపరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఎన్‌టిపిసి మాజీ సిఎంఒ డాక్టర్ కె..విజయ పాల్గొని విద్యార్థులందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.కళ్ళు, చెవులు, దంతాలు, బరువు, ఎత్తు, శరీర ధారుఢ్యం సమగ్ర ఆరోగ్యతనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ, పిల్లలలో కనిపించే సాధారణ వ్యాధులు, పోషకాహార లోపాలు, దంత, దృష్టి లోప సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లల ఆహారపు అలవాట్లు, శుభ్రత, శారీరక వ్యాయామం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రంగారావు మాట్లాడుతూ 'పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరనే నమ్మకంతో ఏటా విద్యార్థులందరికీ ఆరోగ్యపరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం చొరవపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐద్వా మహాసభను జయప్రదం చేయండి



మహిళలతో మాట్లాడుతున్న ఐద్వా నేత వరలక్ష్మి

**ప్రజాశక్తి -అనకాపల్లి :** ఈనెల 31న అనకాపల్లి జిల్లా కశింకోటలో జరిగే ఐద్వా 5 జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో మూలపేటలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూలపేట గ్రామంలో గంజాయి, మద్యం విపరీతంగా అమ్ముతున్నారని, సాయంత్రమైతే మహిళలు ఆడవాళ్లు బయటికి రావడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. ఆలయ సమీపంలోనే మద్యం అమ్మకాలు చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు యూ నాగమణి, రూప, రత్నం, స్థానికులు పాల్గొన్నారు.

**పరవాడ :** ఈనెల 31న అనకాపల్లి జిల్లా కశింకోటలో ఐద్వా జిల్లా మహాసభ, వచ్చే అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం పరవాడ తహశీల్దార్ కార్యాలయం సెంటర్‌లో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ, మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మద్యం, గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఐద్వా మండల అధ్యక్షులు మన్యాల బంగారం, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఇబ్బందులు తొలగించేందుకు బస్సులు పెంచాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు అందజేయాలనికోరారు. మైక్రో ఫైనాన్స్, స్పందన వంటి లైసెన్స్ లేని సంస్థలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవి, సాయి మంగమ్మ, లక్ష్మమ్మ, రాజకుమారి పాల్గొన్నారు.



పరవాడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

## కిడ్నీ బాధితునికి చేయూత



సాయం అందిస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

**ప్రజాశక్తి - పరవాడ:** మండలంలోని కన్నూరు శివారులోని మామిడివానిపాలెం గ్రామంలో కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన శీరంశెట్టి నరసింగరావుకు అగనంపూడి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేయూతనందించింది. ఆదివారం సంస్థ ప్రతినిధులు మామిడివానిపాలెంలోని బాధితుని పరామర్శించి, నరసింగరావుకు ఆర్థిక సహాయం అందించారు. సంస్థ సహాయధికారి డాక్టర్ సీహెచ్ తాతాజీ మాట్లాడుతూ, నరసింగరావుకు నెలకు సరిపడా నిత్యవసర సామాగ్రి, కొంత నగదు అందించామన్నారు. వ్యవస్థాపకులు గెద్దాడ రమేష్, రూకన రాము, ఉదయ్, ఈశ్వరావు, వర్మ, రామకష్ణ, సూర్య, మడక నూక నాగ సత్తిబాబు, మామిడి నాగరాజు, మామిడి దాౖరాజు, మామిడి వెంకటేష్, మామిడి మహేష్, మడక రాంబాబు, మామిడి శివ పాల్గొన్నారు.

## పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న జానీ తదితరులు

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్** : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జి మలసాల భరత్ కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన లెప్రసీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పేదలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 82 వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, జాజుల రమేష్, వేగి త్రినాథ్, ఉగ్గిన శ్రీను, గైపురి రాజు, కెఎం నాయుడు పాల్గొన్నారు.

## క్షతగాత్రుని వైద్యానికి సాయం



క్షతగాత్రునికి సపర్యలు చేస్తున్న భీమరశెట్టి రాంకీ


**ప్రజాశక్తి -అనకాపల్లి** : అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ( రాంకీ) మరోసారి మానవతను చాటుకున్నారు. పెందుర్తి వాసి ఆడారి అప్పారావు కశింకోటలోని తమ సమీప బంధువు ఇంటికి వెళ్లి వస్తుండగా శారద బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి కింద పడి తకు గాయం కావడంతో ఆపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు. అంబులెన్సు రావడానికి ఆలస్యమౌతున్న పరిస్థితుల్లో అటుగా వెళ్తున్న జనసేన నియోజకవర్గ ఇంచార్జి రాంకీ వెంటనే స్పందించి ఆటోలో జనసేన కార్యకర్త బుద్ధ మనోహర్ సాయంతో ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయంచారు. సకాలంలో చికిత్స అందడంతో అప్పారావు స్పృహలోకి వచ్చాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించేందుకు సహకరించిన రాంకీని పలువురు అభినందించారు.

## 20,468 హెక్టార్లలో వరినాట్లు పూర్తి

**ప్రజాశక్తి-అనకాపల్లి** : జిల్లాలో ఇంతవరకూ20,468 హెక్టార్లలో వరినాట్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెలాఖరుకు సుమారు నలభై వేల హెక్టార్లలో పూర్తి అవుతాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియా 2166మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. మరో మూడువేల 110మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని నివేదిక అందజేశామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు.

# వింతవ్యాధితో పాడి గేదె మృత్యువాత

- డాక్టర్లు లేక సకాలంలో అందని వైద్యం
- ఆసుపత్రుల చుట్టూ తిప్పినా దక్కని ప్రాణాలు



చనిపోక ముందు అనారోగ్యంతో పాడిగేదె

**ప్రజాశక్తి -వడ్డాది :** బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం గ్రామానికి చెందిన వంటాకు ఏసుకు చెందిన పాడిగేదె వింత వ్యాధితో మృత్యువాత పడింది. పాడిగేదె అస్వస్థతకు గురైన తర్వాత ముందుగా స్థానిక సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించారు. అయినా నయం కాకపోవడంతో పడ్డాది పశువైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడ డాక్టర్ బదిలీ అయినా, వేరొకరిని నియమించకపోవడంతో వైద్యం చేయించకుండా ఇంటికి తిరిగి వచ్చారు అనకాపల్లికి చెందిన పశ వైద్యుని సంప్రదించి, ఆయనను ఎల్‌బిపి అగ్రహారానికి తెచ్చే ప్రయత్నం చేస్తుండగానే నోట్లోంచి రక్తం కక్కుతూ మరణించిందని ఏసు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పాడిగేదెకు వైద్యం అంది ఉంటే బతికి ఉండేదని, వైద్యులు, వైద్యసేవలు అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే తనకు తనకు నష్టం జరిగినందున ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి, వైద్యులను నియమించి, సేవలను మెరుగుపరచాలని కోరాడు.

## రైతులకు యూరియా పంపిణీ

**ప్రజాశక్తి- మునగపాక:** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆదివారం రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలకు అవసరమయ్యే యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఆదివారం యూరియా పంపిణీ జరగడంతో రైతులు సహకార సంఘం వద్ద పెద్ద ఎత్తున పోటెత్తారు. యూరియాను కొనుగోలు చేసేందుకు క్యూలైన్లో నిల్చొని తీసుకువెళ్లారు. తమ సహకార సంఘానికి 12 టన్నులు యూరియా కేటాయించగా, ఆదివారం ఒక్క రోజున 6 టన్నుల పైగా యూరియాను రైతులకు పంపిణీ చేపట్టినట్లు సహకార సంఘం అధ్యక్షులు ఇల్లూరి నూక నర్సింగరావు తెలిపారు.

## పార్టీ కమిటీల నియామకానికి ప్రతిపాదనలు

**ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ :** ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం త్రీ మెన్ కమిటీ సభ్యులుగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావ ఆదివారం ఏలూరు పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు అనుబంధ సంస్థల కమిటీ సభ్యులు పార్టీ నియమావళిని వివరించారు. జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ప్రతిపాదనలు తీసుకున్నారు. 17 అనుబంధ సంస్థల కమిటీలకు ఇవ్వాలని, ఈ కమిటీలు నియమించడానికి గతంలో జిల్లా కమిటీ, అనుబంధ సంస్థల కమిటీలు, మండల పార్టీ అధ్యక్షుడు కార్యదర్శులు అభిప్రాయం తీసుకుని ముగ్గురు సభ్యులు ఏకాభిప్రాయంతో పార్టీ అధిష్టానానికి పంపుతామన్నారు.

## చెరువును ఆక్రమిస్తే చర్యలు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** మండలంలోని తురకలపూడి గ్రామం సర్వే నెంబరు.191లో స్వామి నాయుడు చెరువు వద్ద మండల రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. చెరువు గర్భంలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం 1905, 2017 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు . చెరువు గర్భంలో కొంత మంది ఇప్పటికే సరుగుడు తోట సాగు చేస్తున్నారు. చెరువు విశాలంగా ఉండడంతో రైతుల తమకు నచ్చిన విధంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

చెరువు గర్భంలో హెచ్చరిక బోర్డు



# ఆటో కార్మికులను ఆదుకోవాలి




నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

**ప్రజాశక్తి-సబ్బవరం:** స్త్రీశక్తి పథకం అమలుతో మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించిన తర్వాత ఆటోలకు గిరాకీ లేక జీవనోపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు .ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ జంక్షన్ లో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ, చదువుకున్న పలువురు నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగాలకు చూడకుండా స్వయంఉపాధికి వడ్డీలకు ప్రయివేటు ఫైనాన్స్‌లో అప్పులు చేసి ఆటోలను కొనుక్కుని జీవనం సాగిస్తున్నారని, నెలసరి అప్పు వాయిదాలను చెల్లిస్తూ ఇన్నాళ్లు కొనసాగినా ఇపుడు ఆటోలకు బేరాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలకుఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులుగా వ్యతిరేకం కాకపోయినా, ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.25వేలు ఆర్థికసాయం పెట్రోల్, డీజిల్,గ్యాస్‌ధరల తగ్గింపు, జిఒ 21 రద్దు, పెంచిన ఫీజులు,పెనాల్టీలు రద్దు, వాహనాలకొనుగోలుకు రూ.4లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు.. ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని,వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా నాలుగు లక్షల రూపాయలు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పట్టణ మండల కేంద్రాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకురాలు యు. సత్యవతి, ఎం.గౌరేష్, కె. కోటి, జి ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు బంగారు నాయుడు, రమణ, అప్పలరాజు పాల్గొన్నారు.

# ఉత్తమ చిత్రాలకు ప్రజాదరణ అవసరం




ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఫిలిం సొసైటీ ప్రతినిధులు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి: అనకాపల్లి ఫిలిం సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు తమ్మన సుబ్బారావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఫిలిం సొసైటీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, అనకాపల్లి ఫిలిం సొసైటీ 2009 నుండి 2019 వరకు పదేళ్లపాటు జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ చిత్రాలను పట్టణ ప్రేక్షకులకు అందించిందన్నారు. కోవిడ్ ప్రభావంతో 2019 తర్వాత ఇప్పటివకు ఫిలిం సొసైటీ కార్యక్రమాలు వెనకబడ్డాయని, ఈ ఏడాది ఈనెల 3 తేదీ నుండి తిరిగి ఫిలిమ్స్ సొసైటీ సినిమా ప్రదర్శనలు మొదలయ్యాయన్నారు. పట్టణ సినీ అభిమానులు సంస్థ కార్యకలాపాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఫిలిం సొసైటీ కార్యదర్శి పివ్.అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయునిగా, లిటిల్ ఆక్స్‌ఫర్డ్ ప్రైమరీ స్కూల్ వ్యవస్థాపకునిగా వందలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన కమలాకర్‌రావు మాస్టర్ మరణించి ఈనెల 9కి ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అనకాపల్లి ఫిలిం సొసైటీకి దీర్ఘకాలం ఉపాధ్యక్షునిగా ఆయన సేవలకు గుర్తుగా ఈనెల 31వ తేదీన స్థానిక పాత బెల్లం మార్కెట్ ఎదురుగా ఉన్న ఉప్పల రమాకుమారి మినీ హాల్లో '35 చిన్న కథ కాదు' అనే తెలుగు సినిమాను ప్రదర్శిస్తున్నామన్నారు.

**ఫిలిమ్స్ సొసైటీ నూతన కార్యవర్గం**

ఈ సందర్భంగా అనకాపల్లి ఫిలిం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. ఫిలిం సొసైటీ సంవత్సర సభ్యత్వాన్ని రూ.500గా నిర్ణయించారు. సొసైటీ అధ్యక్షురాలిగా సరిపల్లి సూర్య కుమారి, ఉపాధ్యక్షులుగా వేణు మాస్టారు, ఐఆర్. గంగాధర్, కార్యదర్శిగా పిఎస్ అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శిలుగా జిఎల్ఎన్. శాస్త్రి, డాక్టర్ దివితేజ, కోశాధికారిగా శ్రీధరాల సూర్యనారాయణ, సభ్యులుగా దొడ్డి అప్పారావు, అజయ్ సెల్యూస్, గౌరవ అధ్యక్షులుగా తమన్న సుబ్బారావు ఎంపికయ్యారు. సినీ అభిమానులు సభ్యులుగా చేరి అనకాపల్లి ఫిలిం సొసైటీ కార్యక్రమాలకు చేయూతను అందించాలని నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది.

# అద్దింట్లో మహిళా సమాఖ్య కార్యాలయం

- ఏళ్ల తరబడి కార్యకలాపాలకు అవస్థలు
- పట్టని అధికారులు, నేతలు

**ప్రజాశక్తి -కశింకోట :** కశింకోటలో మండల సమాఖ్య కార్యలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. మండలాలు, డ్వాక్రా వ్యవస్థ ఆవిర్భవించి ఏళ్ల గడుస్తున్నా, కశింకోటలో డ్వాక్రా సంఘాల కార్యకలాపాల నిర్వహణకు సొంత గూడు లేకపోవడంపై మహిళలు విస్మయం చెండుతున్నారు, మండలంలో 27 పంచాయతీల పరిధిలోని 42 గ్రామాలకు చెందిన వెయ్యికి పైగా స్వయంశక్తి సంఘాల గ్రూపులు, తమ సమావేశాల నిర్వహణకు, కార్యకలాపాలపై సమీక్షిందుకు, గ్రామసంఘాలతో సమీక్షలను మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోనే నిర్వహిస్తారు ఈకార్యలయంలోనే మండల మహిళా సమాఖ్య సభ్యులకు, సిఎలకు శిక్షణ, గ్రామ సంఘాలు ద్వారా మహిళలకు పొదుపు, స్వయంశక్తి రుణాల మంజూరు, ఇతర, సేవా కార్యక్రమలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా ఇక్కడే నిర్వహిస్తారు. మహిళలను ఆర్థికస్వావలంభన దిశగా చేపట్టే అన్ని చర్యలు, కార్యకలాపాల నిర్వహణకు వేదికైక మండల మహిళా సమాఖ్య, వెలుగు కార్యాలయం అద్దింట్లో, అరకొర సౌకర్యాల మధ్య కొనసాగడంపై విమర్శలున్నాయి. అయినా అధికారులు, నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా మండల మహిళా సమాఖ్య, వెలుగు కార్యాలయానికి సొంత భవనం సమకూర్చే చర్యలు చేపట్టాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.




అద్దె భవనంలో నడుస్తున్న మండల సమాఖ్య కార్యాలయం

# రహదారి భద్రతపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణ రావు

**ప్రజాశక్తి- కశింకోట :** రహదారి భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చొచ్చని స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. ఆదివారం కశింకోటలో నూకాంబిక ఆటో యూనియన్ కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం మత్తులో నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలకు బీమాతోపాటు అన్ని పత్రాలు ఉండాలని, పరిమితికి లోబడిన ప్రయాణికులతో, వేగంతో ఆటోలను నడపాలని సూచించారు. కార్యక్రమంలోఆటో యూనియన్ ప్రతినిధులు బత్తిన వీరభద్రం,ఒమ్మి శ్రీనివాసరావు, మోసూరు చిన్న, నీలపాటి లోవరాజు, సంతోష్, రాజు పాల్గొన్నారు

## కంకర క్వారీ లారీల పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న లారీలు

**ప్రజాశక్తి -కోటవురట్ల :** మాకవరపాలెం మండలం జి కోడూరు కంకర క్వారీ నుండి రాత్రి సమయంలో అధిక లోడుతో వస్తున్న మూడు భారీ వాహనాలను శనివారం రాత్రి స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్ఐ ఇచ్చిన వివరాలివి. ఎటువంటి అనుమతులు లేకుండా రాకపోకలు సాగిస్తున్న మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని ఆర్‌టిఒ అధికారులకు అప్పగించామన్నారు, గతంలో కూడా ఇదే మాదిరిగా భారీ వాహనాలను పట్టుకుని, అధిక మొత్తంలో జరిమానా విధించామని తెలిపారు, కాగా భారీ వాహనాల రాకపోకలతో రహదారులు ధ్వంసం అవుతున్నాయని స్థానికులు, వాహనదారులు, స్థానికులు అందోళన చెందతున్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎఒ కొంతమ్మ

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిణి ఎల్‌వై.కాంతమ్మ హెచ్చరించారు. ఆదివారం. కాశీపురంలోని వెంకటరోహిణి ఎరువుల షాప్, దేవరాపల్లిలోని మన గ్రోమోర్ ఎరువుల షాప్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు పలు సూచనలు చేశారు. ఎరువులను స్థానిక మండలానికి చెందిన రైతులకే విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి రైతుకు నగదు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, షాప్ బయట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ఏరోజుకారోజు ఎరువుల ధరల్ని, తాజా నిల్వలతో కూడిన సమాచారాన్ని బోర్డుపై ప్రదర్శించాలనే ఆదేశాలు జారీ చేశారు. కాలం చెల్లిన పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎరువులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని షాప్ యజమానులకు అధికారుల సూచించారు.

# వినాయక విగ్రహ తయారీదారులకు గడ్డుకాలం

## ▶▶ తడిసిమోపెడౌతున్న తయారీ వ్యయం
## ▶▶ ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేక నష్టాలబాట



**ప్రజాశక్తి-కె.కోటపాడు** : వినాయక విగ్రహాల తయారీలో జిల్లాలోనే ప్రసిద్ధిచెందిన చౌడువాడ గ్రామంలోని తయారీదారులు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా ఇదే వృత్తిని నమ్ముకుంటూ, ఏడాదిలో నాలుగు నెలలపాటు ఈ పనిలో ఉంటున్న వీరికి ప్రస్తుతం ఆశించిన స్థాయిలో విగ్రహాల అమ్మకాలు లేక గిట్టుబాటు కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. వినాయక విగ్రహాల తయారీకి వాడే ముడి సరుకుల ధరలు పెరగడం, పెరిగిన విద్యుత్ బిల్లులు, లేబర్, రవాణా ఛార్జీలతో విగ్రహాల తయారీ వ్యయం తడిసిమోపెడౌతుండగా, దీనికితోడు ఎండావానల నుంచి తయారుచేసిన విగ్రహాలను సంరక్షించడానికి పాలిథిన్ కవర్లు అదనపు ఖర్చు తప్పడం లేదు. అయితే తయారీ వ్యయానికి తగ్గట్టుగా విగ్రహాల అమ్మకాలుగానీ, వాటి ధరగానీ లేకపోవడంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. చౌడువాడ గ్రామంలో మాకారపు ఈశ్వరరావు, మాకారపు శంకరరావు ఉరిమి ఈశ్వరరావు కంపెనీలు వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. దాదాపు 15 నుంచి 20 వరకు కార్మికులు పనిలో ఉంటున్నారు. అడుగు నుండి 13 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారీ చేస్తుండగా, వాటిని రూ.వెయ్యిన ఉంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతీయలతోపాటు కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి ఉత్సవ నిర్వాహకులు ఇక్కడికి వచ్చి విగ్రహాలను కొనే పరిస్థితి ఉండేది. నిర్వాహకుల ఇండెంట్ మేరకు పర్యావరణహితమైన రంగులతో, మట్టితో విగ్రహాలను తయారీచేసి సరఫరా చేసేవారు. కొన్నాళ్ల క్రితం వరకు ఈ వృత్తి వీరికి లాభసాటిగానే సాగిపోయినా, ఇపుడు గడ్డుపరిస్థితిలో ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి, వినాయక బొమ్మల తయారీకి రాయితీ ధరలతో ముడి సరుకులు, ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని తయారీదారులు కోరుతున్నారు.

**సబ్బవరం :** తమ నైపుణ్యంతో వినాయక ప్రతిమలను జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నా, తమ బతుకులు మారడం లేదని మండలంలోని ఇరువాడ కుమ్మరి కాలనీకి చెందిన కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన ధర పలకకపోవడం వల్ల జీవనోపాధికి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి

బిఎ డిగ్రీ చదువుకున్నాను, ఆర్టలు చూసి ప్రతిమలు, విగ్రహాలు చేస్తాను. మౌల్డింగ్ విగ్రహాల తయారీలో కూడా నైపుణ్యం ఉంది. వినాయక విగ్రహాలకు గిట్టుబాటు ధరలు లేవు. ప్రభుత్వం కులవృత్తిదారులను ఆదుకోవాలి.



**మునంపాక సత్యనారాయణ కుమ్మరికాలనీ, ఇరువాడ పంచాయతీ**

### నైపుణ్యానికి దక్కని ప్రతిఫలం

30ఏళ్లకు పైగా దేవతావిగ్రహాల తయారీ, అమ్మకాలతోనే జీవనోపాధి సాగిస్తున్నాం. శ్రమకు తగిన ఆదాయం లేకపోవడం, విగ్రహాలకు ఆశించిన ధర అమ్మకాలు లేకపోవడం వల్ల బతుకు దుర్భరమౌతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.



**- గంగవరపు తాతబాబు, కుమ్మర కాలనీ, ఇరువాడ పంచాయతీ**

### ముస్తాబవుతున్న గణనాథుని విగ్రహాలు



**ప్రజాశక్తి-నర్సీపట్నం:** నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో గణనాథుని విగ్రహాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొని విక్రయాలకు సిద్ధం చేశారు. ఈనెల 27న జరగనున్న వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో బొడ్డేపల్లి, నర్సీపట్నం, బలిఘట్టం, ప్రాంతాలలో విగ్రహ నిర్వాహకులు విగ్రహాలను అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ఎంతో ఉత్సాహంగా అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొంటారు. విగ్రహాలు కొన్ని ప్రాంతాలలో డిమాండ్ ఉండగా మరికొన్ని ప్రాంతాలలో కొనుగోలు చేసే వాళ్ళు లేకపోవడంతో విగ్రహ తయారీదారులు ఆవదన వ్యక్తం చేస్తున్నారు, ఒక్కో విగ్రహం 2 వేల నుంచి 20 వేల వరకు అమ్మకాలు చేపడుతున్నారు.భారీ విగ్రహాలు ప్లాస్టరాఫ్ ప్యారిస్‌తో తయారు చేయడంతో కొనుగోలు చేసేందుకు కొంతమంది ఆసక్తి చూపలేదు. కొంతమంది పరిసర ప్రాంతాల్లో సొంతంగా తయారుచేసి విక్రయాలు చేపడుతూ ఉండగా మరి కొంతమంది వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వం విగ్రహ ఏర్పాటుకై అనుమతులకు యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించడంతో పాటు ఫీజు లేక పోవడంతో విక్రయాలు అధిక శాతంగా జరుగుతాయని అంచనాలు వేస్తున్నారు. గతంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరకు అనుమతుల కోసం తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ యాప్ వినియోగం అందరికి అందుబాటులోకి ఉంది.



అభినందిస్తున్న నాయకులు

## టిడిపి మండల అధ్యక్షునిగా వేణుగోపాల్

**ప్రజాశక్తి-గొలుగొండ:** గొలుగొండ మండలం తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గొలుగొండ మండలం జోగుంపేట టీడీపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులంతా వేణుగోపాల్‌ను మండల పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరు అయ్యేందుకు తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు.

మండల కార్యవర్గాన్ని కూడా ఎన్నుకోవడం జరిగింది. వీరిలో ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా భూపతి లోవరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కిల్లాడ సునీత, తెలుగు యువత అధ్యక్షుడిగా అల్లు రమణ, తెలుగు యువత మండల ఉపాధ్యక్షులుగా గండేపల్లి రాము, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నర్సా లోవబాబు(చిన్న), తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా నూతిగట్టు అప్పలరాజు, బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శిగా సగరపు రామకృష్ణ తదితరులను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గోతులు పడిన రహదారి

## ప్రధాన కూడలి వద్ద రహదారి ఛిద్రం

**ప్రజాశక్తి-నర్సీపట్నం:** నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి పెద్దబొడ్డేపల్లి వద్ద సిగ్నల్ పాయింట్ సమీపంలో రోడ్డంతా ఛిద్రమై పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధానంగా కొత్తకోట వెళ్లే దారిలో గోతులు మరి ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడేటప్పుడు గోతుల్లో నీరు నిలిచి రోడ్డు సక్రమంగా కనిపించక అవస్థలు పడుతున్నారు అధికారులు స్పందించి కనీసం కూడలి వద్దనైనా గోతులు పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి-రావికమతం:** మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో డ్రెయిన్లు , కచ్చా కాలువలు, తడి ప్రదేశాలు, పిచ్చి తుప్పలు లేకుండా పరిశుభ్రంగా చేస్తున్నామని తెలిపారు. దోమల నివారణకు డ్రైనేజీల్లో పిచికారి చేయడం జరుగుతుందన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలందరూ ఆరోగ్య వంతులుగా ఉండగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, ఏఎన్ఎం ప్రభ, ఆశ ,గ్రీన్ అంబాసిడర్ పలువురు పాల్గొన్నారు.

## 26న ఇంటర్వ్యూ

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూలై 10వ తేదీన విడుదల చేసిన ఆశా వర్కర్ పోస్టుల నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రొవిజినల్‌గా సెలెక్ట్ అయిన పాడేరు డివిజన్ 11 మండలాలకు సంబంధించిన అభ్యర్థినులకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 10 గంటల నుండి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వర నాయుడు తెలిపారు. ప్రొవిజినల్‌గా సెలెక్ట్ కాబడిన అభ్యర్థులు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావలసినదిగా పేర్కొన్నారు.

# సూపర్‌వైజర్ కిరణ్‌కు ఘన సత్కారం



కిరణ్ దంపతులను సత్కరిస్తున్న డైరెక్టర్, అధ్యక్షులు

**ప్రజాశక్తి- నక్కపల్లి:** విశాఖ డెయిరీ, తుని యూనిట్, చినదొడ్డిగల్లు బిసిసి సూపర్వైజర్‌గా పనిచేసిన నక్కా కిరణ్ ఆత్రేయపురం బదిలీ అయ్యారు. ఈ మేరకు మండలంలో రేబాక గ్రామంలో ఆదివారం వేతన కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విశాఖ డెయిరి బోర్డు డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులతో కలిసి బదిలీపై వెళ్లిన కిరణ్ దంపతులకు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. చిత్రపటాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ తుని యూనిట్ లో 20 ఏళ్ల పాటు సూపర్వైజర్‌గా కిరణ్ అంకితభావంతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. పాల సొసైటీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. సొసైటీల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు కిరణ్ సేవలను కొనియాడారు. సూపర్వైజర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శంకర్ ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుని యూనిట్ మేనేజర్ ఎం శ్రీను, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, గొట్టుముక్కల శ్రీహరి రాజు, ఉపమాక సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొండ చిలువ హల్ చల్

### - హతమార్చిన యువకులు

**ప్రజాశక్తి-రోలుగుంట:** మండలంలోని నిండుగొండ గ్రామంలో ఆదివారం ఉదయం 12 అడుగుల కొండ చిలువ హల్ చల్ చేసింది. గ్రామంలోని మర్రిచెట్టు వద్ద ఒక నాటుకోడిని మింగుతూ గ్రామస్థుల కంట పడింది. దీంతో, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. నాటుకోడి మింగడంతో కొండ చిలువ కదల్లేని పరిస్థితి నెలకొంది. ఈ కొండ చిలువను చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు. కొంత యువకులు దాన్ని హతమార్చారు.



రోడ్డుపై వెళుతున్న కొండ చిలువ

## వడ్డాది వంతెనపై ట్రాఫిక్ జామ్

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:** మండలంలో గల వడ్డాది వంతెన పై వాహనాలు ఆదివారం రాత్రి నిలిచి పోయాయి. డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరమ్మతులకు కావడంతో డైవర్షన్ రోడ్డు నుండి వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. కూలిన వంతెన పైనుండే వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విజయరామరాజుపేట వద్ద వంతెన కూలి పోవడం డైవర్షన్ రోడ్డు సైతం కొట్టుకుపోవడంతో ఆ రోడ్డు గుండా కూడా వాహనాలు నిలిపివేయడంతో వడ్డాది వంతెన పై నుండి రాకపోకలు ఎక్కువయ్యాయి. తరచు వాహనాల రద్దీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నిలిచిన వాహనాలు



సన్మానిస్తున్న హోం మంత్రి అనిత

## డిఎస్‌సి ర్యాంకర్ విజయ్‌కు ఘన సత్కారం

**ప్రజాశక్తి -నక్కపల్లి:** మెగా డీఎస్సీలో 3 విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన వమ్మవరం గ్రామానికి చెందిన సుంకరణం విజయ్‌ను హెూం మంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించారు. నక్కపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విజయ్ కు శాలువాతో సత్కరించి అభినందించారు. పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలానికి చెందిన విజయ్ మెగాడీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (గణితం)లో 94.7 మార్కులు, పీజీటీ (గణితం)లో 78.5 మార్కులు, టీజీటీ (గణితం) విభాగంలో 87.3 మార్కులు సాధించి మూడు కేటగిరీల్లో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించడం గర్వకారణమని మంత్రి అనిత అన్నారు. విజయ్ నిర్దేశించుకున్న లక్ష్యం, సాధించేందుకు చూపిన పట్టుదల, కృషి, అంకితభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా మెగాడీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించిన ఇతర అభ్యర్థులందరికి కూడా మంత్రి అనిత అభినందనలు తెలియజేశారు.



తనిఖీ చేస్తున్న ఎఒ

## ఎరువుల షాపులో తనిఖీలు

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని ఏటిగైరంపేట ఎరువుల దుకాణంను ఆదివారం మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ నిల్వలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయాలు చేపట్టాలని, అధిక రేట్లకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

## తాగునీటి బోరు ఏర్పాటు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:** మండలం లో గల చిట్టియ్యపాలెంలో తాగునీటి బోరు నిర్మాణ పనులను ఆదివారం జడ్పిటిసి దొండా రాంబాబు ప్రారంభించారు. గ్రామ పెద్దల విజ్ఞప్తి మేరకు పాండూరి వారి వ్యవసాయ కల్లాలు వద్ద తాగునీటి బోరుని ఏర్పాటు చేస్తున్నట్లు జడ్పిటిసి రాంబాబు తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుచ్చయ్యపేట మండలంలో ఎక్కడ అవసరమైనా తన జడ్పిటిసి గ్రాంట్స్ నుండి తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తానన్నారు. ఎక్కువమందికి ఉపయోగపడే ప్రదేశాలలోనే బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బుదిరెడ్డి అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

# పంచ్ అదుర్స్

- బాక్సింగ్‌లో పలు పతకాలు కైవశం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్న మౌనిక



**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న మౌనిక బాక్సింగ్ క్రీడలో రాణిస్తోంది. చిన్ననాటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్న ఆమె, కష్టపడి సాధన చేసి ఇటీవల జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకుంది. అంతకుముందు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రజత పతకం సాధించి ప్రతిభ చాటింది. మౌనిక సాధన వెనుక ఆమె తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకం ఉన్నాయి.చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె, భవిష్యత్తులో జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు సాధించాలని ఆమె కఠోనంగా సాధన చేస్తోంది.

మౌనిక సాధించిన విజయాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఉదయం వెలుతురు రాకముందే ఎన్టీఆర్ మిని స్టేడియంలో సాధన, తర్వాత కాలేజీకి హాజరై పాఠాలు నేర్చుకోవడం ఇదే మౌనిక దినచర్య. కఠినమైన ట్రైనింగ్తో పాటు చదువులను కూడా సమన్వయం చేయడం చిన్న విషయం కాదు. అయినా కష్టం చేస్తేనే ఫలితం వస్తుంది అనే నమ్మకంతో ముందుకు సాగుతోంది.

తనను ప్రోత్సహించిన తన తండ్రి ఇటీవల మరణించడం తీవ్ర విషాదాన్ని ఎదుర్కొంది. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న తన తండ్రి ఆమె రాష్ట్ర జిల్లా స్థాయిలో పతకాలు తెస్తుంటే మురిసి పోతుండేవాడు. 'జాతీయస్థాయిలో నిన్ను చూడాలమ్మ' అన్న తండ్రి కోరికను నెరవేర్చుకుంటానే తరువు చాలించడంతో మౌనిక కుంగిపోలేదు. నింజాస్ అకాడమీ కమిటీ, తన ప్రోత్సాహం ఆమెకు మరింత తోడ్పాటు ఇచ్చింది.

కోచ్ అబ్బు మార్గదర్శకం, నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగ నారాయణరావు ప్రోత్సాహం, ఆర్థిక సహకారం మరువలేనిదని మౌనిక తెలిపింది.

పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే విజయాన్ని సాధించవచ్చని నిరూపిస్తోంది మౌనిక. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఒక అమ్మాయి బాక్సింగ్ రంగంలో రాణించడం యువతకు ప్రేరణగా నిలుస్తోంది. క్రీడల పట్ల పట్టుదల, కష్టానికి భయపడని తత్వం ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపిస్తోంది.

నర్సీపట్నం యువతి బొంతు మౌనిక డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఈ యువ బాక్సర్, వరుస విజయాలతో రాణిస్తోంది. రింగ్లో తన ప్రతిభను చూపిస్తున్న మౌనిక గెలిచిన మెడల్స్ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. 2006 జనవరి 8న జన్మించిన మౌనిక చిన్నప్పటి నుంచే ఆటల పట్ల మక్కువ చూపింది. 2017లో వేసవి శిబిరంలో తొలిసారిగా బాక్సింగ్ సాధన మొదలుపెట్టి, కేవలం కొద్ది కాలంలోనే తన ప్రతిభను నిరూపించింది.

### సాధించిన మెడల్స్:

గోల్డ్‌మెడల్: ఆర్ఈసీ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ (అస్సాం)

సిల్వర్ మెడల్: నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్, హర్యానా

గోల్డ్ మెడల్: ఓపెన్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్షిప్ బెంగళూరు (2024)

బ్రోన్జ్ మెడల్: జూనియర్ నేషనల్ బాక్సింగ్, సోనిపట్ (హర్యానా) (2020-21)

సిల్వర్ మెడల్: సబ్ జూనియర్ రూరల్ నేషనల్ బాక్సింగ్, పూణే (2019-20)

### ఎపిలో గెలిచిన బంగారు పతకాలు

స్టేట్ జూనియర్ బాక్సింగ్ (2020, 2021,2022), స్టేట్ యువ మహిళల బాక్సింగ్, విశాఖపట్నం (2023), ఏపీ సీఎం కప్ సీనియర్ బాక్సింగ్, తిరుపతి (2023), ఎపి ఎస్‌జిపి స్టేట్ బాక్సింగ్, రాజమండ్రి (2023), ఎస్ఎపి బాక్సింగ్ ఛాంపియన్షిప్, విశాఖపట్నం (2022) లో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది.



మౌనికను సత్కరిస్తున్న ప్రముఖులు

### బాక్సింగ్ రింగ్ ఏర్పాటు చేయాలి

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కొందరి దాతల సహకారం, ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహాలతోను తర్ఫీదును ఇస్తున్నాం. బాక్సింగ్ మాత్రమే కాకుండా ఇక్కడ అనేక రంగాల్లో శిక్షణ పొందుతున్నారు. బాక్సింగ్ రింగ్ ఉంటే ఇక్కడ ఉన్నటువంటి యువత మరింత స్థాయికి వెళ్లి పతకాల సాధించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టి నర్సీపట్నంలో బాక్సింగ్ రింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం

**అబ్బు,**
**నింజాస్ అకాడమీ కోచ్**

## డిఎస్‌సి ఫలితాల్లో ఒకేసారి రెండు ఉద్యోగాలు



వాలేటి సురేష్

**ప్రజాశక్తి- దేవరాపల్లి** : మండల కేంద్రం దేవరాపల్లి కుమ్మర వీధికి చెందిన వాలేటి సురేష్ డిఎస్‌సి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి పోస్టులకు అర్హత సాధించాడు.

ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్‌జిటిలో 87.2 మార్కులతో 45వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ విభాగంలో 32వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. మెగా డిఎస్‌పి ఫలితాల్లో ఒకేసారి రెండు విభాగాల్లో అర్హత సాధించిన సురేష్ ప్రతిభను గ్రామస్తులు అభినందించారు.

## నేడు రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : స్థానిక 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 25న ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల దాతలు రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

## విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ

### ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు డిమాండ్



పాడి రైతులతో మాట్లాడుతున్న అప్పారావు

**ప్రజాశక్తి- మునగపాక:** విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులను తక్షణమే శిక్షించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చూచుకొండ, గణపర్తి, ఆనందపురం, కుమారపురం గ్రామాల పాడి రైతులతో సమావేశాలు నిర్వహించారు. విశాఖ డెయిరీ అక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలలో పాడి రైతులకు కల్పతరువుగా ఉన్న విశాఖ డెయిరీని తమ స్వార్ధ ప్రయోజనాల కోసం చైర్మన్ అవినీతిమయం చేసి, డెయిరీని, రైతులను నష్టాలు పాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు అండగా ఉండాల్సిన విశాఖ డెయిరీ ప్రస్తుత పాలకవర్గం అంతు, అదుపులేని అవినీతికి పాల్పడుతూ లాభాలను దారి మళ్లించి సొంత ఆస్తుల పెంచుకుంటున్నారని విమర్శించారు . పాలు పోస్తున్న రైతులకు న్యాయమైన ధర ఇవ్వకుండా ధరను తగ్గించడం సరికాదన్నారు. తగ్గించిన పాల ధర తక్షణమే పెంచాలని, డెయిరీ లాభాల నుండి మూడు బోనస్‌లు ఇవ్వాలని, పెంచిన దాణా రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ జనరల్ బాడీ సమావేశానికి రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, పాడి రైతులు కాండ్రేగుల రమణ, చదరం వెంకట రమణ, పోలమర శెట్టి వెంకట అప్పారావు,కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.